క్లుప్తంగా

క్యాష్‌లెస్ వైద్యసేవలు ప్రశంసనీయం

కపిలేశ్వరపురం (మండపేట): రోడ్డు ప్రమాదాల్లో క్షతగాత్రులకు క్యాష్‌లెస్ వైద్యసేవ అందించేలా కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేయడం ప్రశంసనీయమని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కోన సత్యనారాయణ అన్నారు. ఈ ఉత్తర్వుల ప్రకారం ఆస్పత్రిలో చేరిన నాటి నుంచి ఏడు రోజుల పాటు రూ.1.50 లక్షలు విలువైన చికిత్స సేవలను ప్రమాద బాధితుడు పొందవచ్చన్నారు. ప్రమాదం సంభవించిన 24 గంటల్లోపు ఆసుపత్రిలో చేరినవారికి మాత్రమే ఈ సాయం వర్తిస్తుందన్నారు. ఆయుష్మాన్ భారత్ పీఎం జన్ ఆరోగ్య యోజన అమలయ్యే నేషనల్ హెల్త్ అథారిటీ నోటిఫికేషన్ పరిధిలో ఈ పథకం అమలవుతుందన్నారు. ప్రమాద ప్రదేశం నుంచి తొలుత వేరే ఆస్పత్రికి తరలించి ఉంటే ప్రథమ చికిత్స అనంతరం ఆయినా క్యాష్‌లెస్ సేవలందించే నిర్దిష్ట ఆస్పత్రికు తరలించుకోవచ్చని కోన తెలిపారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠ



స్వామిని దర్శించుకుంటున్న ఎంపీపీ నాగమణి తదితరులు

కె.గంగవరం: మండలంలోని మసకపల్లిలో నూతనంగా నిర్మించిన సీతా సమేత రామచంద్రమూర్తి స్వామి, లక్ష్మీగణపతి, లక్ష్మణ ఆంజనేయ స్వామి వార్ల విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాన్ని శనివారం ఆలయ కమిటీ సభ్యులు గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయం వద్ద వేదపండితుల బ్రహ్మత్వంలో ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. గ్రామానికి చెందిన భక్తులతో పాటు చుట్టుపక్కల గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొని స్వామివార్లను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా ఆలయాన్ని సర్వాంగ సుందరంగా విద్యుద్దీపాలు, పూలదండలతో అలంకరించారు. ఈ విగ్రహ ప్రతిష్ఠలో ఎంపీపీ పంపన నాగమణి, వైఎస్సార్ సీపీ నాయకులు పిల్లి కన్నాబ్, పంపన సుబ్బారావు, కాదా గోవింద తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

షిరిడీసాయి విగ్రహ ప్రతిష్ఠ పూజలు



వెదురుమూడిలో సిద్ధమైన బాబా మందిరం

కపిలేశ్వరపురం: వెదురుమూడిలో నూతనంగా నిర్మించిన మందిరంలో షిరిడీ సాయి బాబా విగ్రహ ప్రతిష్ఠ పూజలు శనివారం ప్రారంభమయ్యాయి. అర్చక పండితుల ఆధ్వర్యంలో గ్రామప్రదక్షిణ, గోపూజ, హోమం, నీరాజన మంత్రపుష్పం పూజలు, గ్రామోత్సవం నిర్వహించారు. నేడు బాబా విగ్రహ ప్రతిష్ఠ పూజలు చేయనున్నారు. అనంతరం ఆలయం వద్ద అన్నదానం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

పేదలకు అన్నదానం



మండపేటలో వృద్ధులకు అన్నం వడ్డిస్తున్న సుధాకర్

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట రూరల్ ఏడిద గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు, ఏఎంసీ మాజీ డైరెక్టర్ వలి చెల సుధాకర్ తన పుట్టినరోజు సందర్భంగా అన్నదానం చేశారు. మండపేట పట్టణంలోని హెల్పింగ్ హ్యాండ్స్ స్వచ్ఛంద సేవా సంస్థ కార్యాలయంలో పేద వృద్ధుల మధ్య కేక్ కట్ చేశారు. వృద్ధులకు అన్నదానం చేస్తూ వారితో కలసి భోజనం చేశారు. కార్యక్రమంలో పైడిమల్ల రాజు, ధర్మ, మందపల్లి రవీంద్ర, పైడిమల్ల బాబ్జి, కె.నవ్యతేజ, ఎస్.జయశేఖర్ పాల్గొన్నారు.

రెసిడెన్షియల్ స్కూల్‌కు ఎంపికైన బాలదుర్గ



జంజం బాలదుర్గ

కె.గంగవరం: మండలంలోని అముజూరు ప్రాథమిక పాఠశాలలో విద్య అభ్యసిస్తున్న జంజం బాలదుర్గ ఏపీ రెసిడెన్షియల్ స్కూల్‌కు ఎంపికైనట్లు హెచ్ఎం చొల్లంగి శ్రీను తెలిపారు. చినలో గల రెసిడెన్షియల్ స్కూల్‌లో బాలదుర్గ ఐదో తరగతి ప్రవేశానికి అర్హత సాధించిందని ఆయన పేర్కొన్నారు. ఉత్తమ ప్రతిభ కనబరిచి అర్హత సాధించిన జంజం బాలదుర్గను ఎంఈఓలు నాగరాజు, చోడిశెట్టి ఆంజనేయులు సర్పంచ్ నానాపర్తి కళ్యాణి శ్రీనివాస్, గ్రామ పెద్దలు అభినందించారు.

విద్యుత్ లేక ప్రాణం విలవిల

- సరఫరాలో లోపాలు
- అల్లాడుతున్న చిన్నారులు, వృద్ధులు
- కరెంటు ఇచ్చిన రెండు నిమిషాలకే సరఫరాకు బ్రేక్
- ప్రజాగ్రహాన్ని చవిచూస్తున్న కూటమి ప్రభుత్వం



అంగర సబ్‌స్టేషన్ మెట్లపై కూర్చుని శుక్రవారం నిరసన తెలుపుతున్న ప్రజలు

కపిలేశ్వరపురం: విద్యుత్ విలాపం కానరాని రోజులు. ప్రపంచ వ్యాప్తంగా పెరుగుతున్న వాతావరణ పరిస్థితులు నేపథ్యంలో ఫ్యాన్ కనీస అవసరంగా మారింది. అది లేకుండా చిన్నారులు నిద్రపోని పరిస్థితులు నెలకున్నాయి. ప్రస్తుత కూటమి పాలనలో విద్యుత్ కోతలు, సరఫరా సమస్యలు వినియోగదారులను పట్టి పీడిస్తున్నాయి. ప్రజల నుంచి అగ్రహం చవిచూస్తున్నారు.

ఎన్నికల హామీని విస్మరించిన ప్రభుత్వం...

మండపేట రూరల్ మండలం ఏడిదలో అప్పటి ప్రతిపక్షనేత నారా చంద్రబాబు నాయుడు మాట్లాడారు. 'తమ్ముళ్లా జగన్ ప్రభుత్వం కరెంటును సక్రిగా ఇస్తున్నారా? చార్జీలు పెంచేస్తున్నాడు కదా... మన ప్రభుత్వం వచ్చాకా మీకు ఈ కష్టాలన్నీ లేకిపోతాయి. ప్రతి ఇంటికీ సోలార్ ఏర్పాటు తీసుకొస్తాం. ఫ్యాన్ మాత్రమే కాదు, హాయిగా ఏసీ వేసుకుని చక్కగా బతకొచ్చు. కరెంటు బిల్లు సమస్యే ఉండదు...' అని ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు చంద్రబాబు అన్న మాటలు... కాని లేమైనా కూటమి ప్రభుత్వం రానే వచ్చింది. వచ్చి ఏడాది గడిచింది. ప్రస్తుత ఎండ వేడిమిలో విద్యుత్ సమస్యలు తీవ్రమయ్యాయి. చంద్రబాబు నాయుడు సీఎం అయ్యాకపట్టికీ విద్యుత్ సరఫరా సమస్యలు మరింత ఎక్కువయ్యాయి. చార్జీలు పెరగడాన్ని నియోజకవర్గ ప్రజలు చవి చూశారు.

విద్యుత్ సమస్యలు ఇలా...

నియోజకవర్గ పరిధిలోని విద్యుత్ సబ్ స్టేషన్లలో మరమ్మతుల పేరుతో, లైన్ల మరమ్మతు పేరుతో, విద్యుత్ లైన్ల వెంబడి చెట్టు కొమ్మలు తొలగింపు పేరుతో అధికారికంగానే నిర్దిష్ట సమయాన్ని ప్రకటించి విద్యుత్ సరఫరాను నాలుగు నుంచి ఐదు గంటలు వరకూ తరచూ నిలిపివేస్తున్నారు. ఇవి చాలవన్నట్టు ఎండ వేడి తీవ్రమైనప్పటికీ అప్రకటిత విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నారు. దీంతో మండపేటలోని పలువురు ప్రజాప్రతినిధులు విద్యుత్ సమస్యలను పరిష్కరించాలంటూ అధికారులను కోరుతున్న సందర్భాలున్నాయి. కపిలేశ్వరపురం మండలం అంగర సబ్ స్టేషన్‌లో శుక్రవారం పలు గ్రామాల వారు నిరసన తెలిపారు. వేళాపాళా లేకుండా విద్యుత్ కోతలు అమలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇచ్చిన నిమిషాల్లోనే సరఫరాను నిలిపివేస్తున్నారని, నిద్ర నిద్రలు లేకుండా చిన్నారులు, వృద్ధులు తీవ్ర అవస్థలు పడుతున్నారంటూ వల్లూరు, నల్లూరు, నేలటూరు, వెదురుమూడి గ్రామాల ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయా గ్రామాల్లోని కూటమి నేతలకు సైతం విద్యుత్ కోతల ఆగ్రహాన్ని తెల్పుతున్నాయి. వల్లూరుకు చెందిన టీడీపీ నాయకుడు వల్లూరు వీర బాబు, ముత్యాల వెంకన్నబాబు, మేడిశెట్టి శ్రీనివాస్ తదితరులు మాట్లాడుతూ ఎండవేడి తీవ్రంగా ఉన్న సమయంలో విద్యుత్ సరఫరాను నిలిపివేయడంతో ప్రజలు అల్లాడిపోతున్నారన్నారు. కోతలతో ప్రజలు పడుతున్న పాట్లను వివరిస్తూ సబ్‌స్టేషన్ ఏఈ సత్యనారాయణకు వినతి పత్రాన్ని అందజేశారు.

సామాన్యులు అల్లాడుతున్నారు



విద్యుత్ సరఫరా సమస్యలతో గ్రామాల్లోని సామాన్య ప్రజలు అల్లాడిపోతున్నారు. రాత్రివేళ కరెంటు పోతున్నప్పుడు చిన్నారుల ఏడుపులు చూసి బాధేస్తుంది. ఎండాకాలం విద్యుత్ వినియోగ లోడ్ సహజంగా పెరుగుతుందన్న అంచనా ప్రభుత్వానికి ఉండాలి. సమస్యను పరిష్కరించే దిశగా ప్రభుత్వం కృషి చేయాలి.

– వానిశెట్టి వాసు, అంగర, కపిలేశ్వరపురం మండలం

రెండు నియోజకవర్గాల్లో విద్యుత్ కనెక్షన్లు ఇలా...

సెక్షన్	కేటగిరి 01	కేటగిరి 02	కేటగిరి 03	కేటగిరి 04	కేటగిరి 05	మొత్తం
అర్తమూరు టౌన్	19,105	2,758	90	531	438	22,922
అర్తమూరు రూరల్	18,059	2,067	60	567	704	21,457
కె.గంగవరం	17,598	1,437	33	681	448	20,197
కపిలేశ్వరపురం	20,011	1,391	39	588	936	22,965
మండపేట	22,166	4,143	82	308	171	26,870
ఏడిద	7,030	646	38	146	741	8,601
ద్రాక్షారామ	18,204	2,067	116	413	797	21,597
రాయవరం	21,707	1,917	84	551	868	25,127
మొత్తం	1,43,880	16,426	542	3,785	5,103	1,69,736

ఎంపీ బోస్‌ను కలసిన ప్రసాద్



ఎంపీ బోస్‌ను కలసిన ప్రసాద్ తదితరులు

రామచంద్రపురం: వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యుడు, రాజ్యసభ ఎంపీ పిల్లి సుభాష్‌చంద్రబోస్‌ను రామచంద్రపురం మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు పోలిశెట్టి వరప్రసాద్ స్థానిక గాంధీపేటలోని పార్టీ కార్యాలయంలో శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఎంపీ బోస్ ప్రసాద్‌ను దుశ్శాలువా వేసి పూలమాలతో అభినందించారు. ప్రసాద్ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. ప్రతిపక్షంగా ప్రజల అధికార పార్టీ చేస్తున్న వెన్నుపోటు కార్యక్రమాలపై ప్రజల తరఫున పోరాటం చేస్తామన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను విస్మరించి మోసం చేసిన విధానాన్ని ప్రజల్లోకి తీసుకువెళతామన్నారు. కార్యక్రమంలో పార్టీ నేతలు బంగారు బాబు, వెన్నేటి సుందరరావు(బాబ్జి) శీలం గంగరాజు పాల్గొన్నారు.

పట్టణ సమస్యలు విస్మరిస్తున్న ప్రభుత్వం



మందపల్లి రవికుమార్

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట పట్టణంలో సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం అలసత్వం వహిస్తుందని 8వ వార్డు కౌన్సిలర్ మందపల్లి రవి శనివారం ఒక ప్రకటనలో అన్నారు. పేద సమస్యలు తీవ్రంగా వేధిస్తున్నా ప్రభుత్వం కనీసం స్పందించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టణంలో వడగాడ్పుల తీవ్రంగా ఉండటంతో వృద్ధులు, చిన్నారులు, మహిళలు, సామాన్య ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో విద్యుత్ సరఫరా తరచూ నిలిపివేస్తుండటంతో ప్రజలు అల్లాడిపోతున్నారన్నారు. గత కొద్ది రోజులుగా తాగునీటి సమస్య పట్టణ ప్రజలను పట్టి పీడిస్తుందని రవికుమార్ ఆవేదన వ్యక్తం చేశారు.

పలువురికి ఎమ్మెల్యే పరామర్శ

కపిలేశ్వరపురం (మండపేట): ఆప్తులను కోల్పోయి బాధల్లో ఉన్న పలు కుటుంబాల వారిని వారి ఇళ్లకు వెళ్లి శనివారం ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు పరామర్శించారు. మాచరలో గుడాల మాణిక్యం, వాసంశెట్టి సుబ్బాయమ్మ, కోరుమిల్లిలోని పిల్లంగోరు గోపాలకృష్ణ, నల్లూరులోని గుత్తుల కాంతమ్మ, నురుకుర్తి లక్ష్మి కుటుంబాల సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ గుడాల జయబాబు, సర్పంచ్ అడబాల సత్యనారాయణ, ముత్యాల వెంకట్రావు ఉన్నారు.

విద్యుత్ అధికారులతో ఎమ్మెల్యే చర్చలు



మండపేటలో విద్యుత్ శాఖాధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ల

కపిలేశ్వరపురం (మండపేట): నియోజకవర్గంలో తలెత్తిన విద్యుత్ సరఫరా సమస్యలపై ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు శనివారం విద్యుత్ శాఖ అధికారులతో చర్చించారు. కపిలేశ్వరపురం మండలంలోని వెదురుమూడి, నల్లూరు, నిడసనమెట్ట, వల్లూరు, నేలటూరు గ్రామాల్లో తీవ్రమైన విద్యుత్ సరఫరా సమస్యలున్నాయి. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే వేగుళ్ల మండపేటలోని తన కార్యాలయంలో జిల్లా ఎలక్ట్రికల్ ఎస్‌ఈ రాజబాబు, ఈఈ కె.రత్నాలరావు, రామచంద్రపురం, మండపేట డీఈలతో మరియు తిరుమలరావులతో సమస్యలపై చర్చించారు. అంగర విద్యుత్ సబ్‌స్టేషన్‌పై తీవ్రమైన లోడ్ ఉండటంతో సమస్య వస్తుందన్నారు. టీకేలో మరో విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయడం ద్వారా సరఫరా సమస్యను శాశ్వత పరిష్కారం అవుతుందని అధికారులు చెప్పారు. ఎమ్మెల్యే వేగుళ్ల మాట్లాడుతూ టీకేలో విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణం విషయమై విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌తో ఫోన్‌లో మాట్లాడానని, అనుమతులిచ్చి పనులు చేపట్టేందుకు సానుకూలంగా స్పందించారని చెప్పారు. పుత్తం శ్రీనివాస్, నల్లమిల్లి వీరబ్బి, పెనుమత్స వెంకటప్ప పాల్గొన్నారు.

పీఎం సూర్యఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకోండి



పాతైన విద్యుత్ టవర్లను పరిశీలించి అధికారులకు సూచనలు చేస్తున్న ఎస్ఈ రాజాబాబు తదితరులు

రామచంద్రపురం: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎం సూర్యఘర్ పథకాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోనసీమ జిల్లా ఏపీఈపీడీసీఎల్ సర్కిల్ ఎస్ఈ సిద్దల రాజాబాబు సూచించారు. రామచంద్రపురం పరిధిలో పాతైన డబుల్ సర్క్యూట్ 132 కేవీ విద్యుత్ టవర్లను శనివారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ 132 కేవీ రామచంద్రపురం విద్యుత్ ఉపకేంద్రం నుంచి 132 కేవీ ముమ్మిడివరం, కొత్తపేట, రాజోలు, అమలాపురం విద్యుత్ సబ్ స్టేషన్ వరకు మొత్తం 30 పాతైన డబుల్ సర్క్యూట్ విద్యుత్ టవర్లలో 25 కొత్త టవర్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మిగిలిన 5 టవర్లను, మార్చు సమయంలో విద్యుత్ అంతరాయాలు తగ్గించడానికి గల సాధ్యాసాధ్యాలను డిస్కం, ఏపీ ట్రాన్స్‌కో ఇంజినీర్లతో సమీక్ష సమావేశం డివిజన్ ఆఫీస్‌లో నిర్వహించారు. విద్యుత్ వినియోగదారులందరూ కేంద్ర ప్రభుత్వ పీఎం సూర్యఘర్ పథకాన్ని వినియోగించుకోవాలన్నారు. గృహ విద్యుత్ వినియోగదారులందరికీ అదిక లోడ్‌ను క్రమబద్ధీకరించుకునేందుకు ప్రవేశపెట్టిన స్వయం ప్రాతిపదికన అధిక లోడ్ క్రమబద్ధీకరణ పథకం ఈ నెల 30తో ముగుస్తున్నందున గృహ విద్యుత్ వినియోగదారులందరూ ఈ పథకాన్ని వినియోగించుకోవలసిందిగా విజ్ఞప్తి చేశారు. కపిలేశ్వరపురం మండలంలో విద్యుత్ అంతరాయాలను తగ్గించేందుకు మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు విద్యుత్ అస్తుతాధికారులతో మండపేటలో సమీక్ష నిర్వహించారన్నారు. సమావేశంలో కపిలేశ్వరపురం మండలంలోని విద్యుత్ అంతరాయం తగ్గించుట కోసం కొత్త విద్యుత్ సబ్‌స్టేషన్ టీకే గ్రామంలో అత్యవసరంగా ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే వేగుళ్ల ఆదేశించినట్లు ఎస్ఈ తెలిపారు. ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.రత్నాలరావు, డీఈఈ కె.మురళీమోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక వ్యవసాయంపై అవగాహన ఉండాలి



రైతులతో మాట్లాడుతున్న ఇండియన్ కౌన్సిల్ ఫర్ అగ్రికల్చర్ రీసెర్చ్ ప్రధాన శాస్త్రవేత్త ప్రసాద్

కాజులూరు: ఆధునిక వ్యవసాయ పద్ధతులపై రైతులు అవగాహన కలిగి ఉండాలని ఇండియన్ కౌన్సిల్ ఫర్ అగ్రికల్చర్ రీసెర్చ్ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎల్.కె.ప్రసాద్ అన్నారు. శనివారం శీల రైతు సేవ కేంద్రంలో వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ కార్యక్రమంపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యవసాయాధికారి వి.అశోక్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి శాస్త్రవేత్త ప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై వికసిత కృషి సంకల్ప అభియాన్ యొక్క ఉద్దేశాన్ని రైతులకు వివరించారు ఆధునిక వ్యవసాయ పద్ధతులను శాస్త్రవేత్తలు నేరుగా రైతులకు తెలియజేయాలని ఉద్దేశంతో ఈ కార్యక్రమం రూపొందించడం జరిగిందని తక్కువ పెట్టుబడులతో అధిక దిగుబడులు పొందేలా సాంకేతికతను జోడించి రైతులకు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యాన వన శాఖాధికారి ఎన్.సుజాత, కలవచర్ల కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ బి.నాగేశ్వరరెడ్డి, డాక్టర్ రవీంద్ర, సర్పంచ్ కోమలి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌పై దాడి చేసిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలి



మద్దాల బాపూజీ, రామచంద్రపురం

రామచంద్రపురం రూరల్: జిల్లాలోని అయినవిల్లి తహసీల్దార్ నాగలక్ష్మ్మిపై దాడి చేసి గాయపరిచిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలని ఆంధ్రప్రదేశ్ గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కమిటీ గౌరవాధ్యక్షుడు మద్దాల బాపూజీ శనివారం డిమాండ్ చేశారు. ఇటీవల రాష్ట్ర వ్యాప్తంగా రెవెన్యూ అధికారులపై దాడులు కొనసాగుతున్నాయన్నారు. పోలీసులు చిన్న చిన్న కేసులతో వదిలివేయడంతో రెవెన్యూ అధికారులకు భద్రత లేకుండా పోతుందన్నారు. దాడులు చేసిన వారిపై నాన్‌బెయిలబుల్ కేసులు పెట్టి ప్రభుత్వం కఠినంగా శిక్షించాలన్నారు. అయినవిల్లి మండలంలో జరిగినటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా రెవెన్యూ అధికారులంతా కలసికట్టుగా పోరాడేందుకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు.

బలవంత వెబ్ ఆప్షన్లు అప్రజాస్వామికం



కపిలేశ్వరపురం ఎమ్మార్సీ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న యూటీఎఫ్ ఉపాధ్యాయులు



రాయవరం ఎంఆర్‌సీ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయ సంఘాల నేతలు

కపిలేశ్వరపురం: ఎస్జీటీ ఉపాధ్యాయుల బదిలీల వెబ్ కౌన్సెలింగ్ నిర్వహించడాన్ని ఉపాధ్యాయ ఐక్యవేదిక వ్యతిరేకిస్తూ శనివారం నిరసన తెలిపారు. కపిలేశ్వరపురం ఎమ్మార్సీ కార్యాలయం ఎదుట ఉపాధ్యాయులు తమ నిరసనను వ్యక్తం చేశారు. ఉపాధ్యాయ సంఘాలు ఈ విషయమై బహిష్కరించినప్పటికీ ప్రభుత్వం ఐచ్ఛిక ఎంపికలు, ఉపాధ్యాయులను వెంటనే వెబ్ ఆప్షన్లను పెట్టాలంటూ తీవ్రమైన ఒత్తిడి చేస్తున్నారని యూటీఎఫ్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల కేంద్రాల్లో కంప్యూటర్లను ఏర్పాటు చేసి మరీ ఉపాధ్యాయులను బలవంతంగా వెబ్ ఆప్షన్లను పెట్టించడం ప్రభుత్వం అప్రజాస్వామికమన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా నాయకుడు పి.సురేంద్ర, మండల కమిటీ అధ్యక్షుడు జల్లా శ్రీనివాస్, కార్యదర్శి ఇల్లూరి సూరిబాబు, నాయకులు గుడిమెట్ల భీమేశ్వరరావు పాల్గొన్నారు.

మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించాలంటూ నిరసన

రాయవరం: సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుల(ఎస్జీటీ)కు మాన్యువల్ విధానంలో బదిలీ కౌన్సెలింగ్ నిర్వహించాలంటూ శనివారం నిరసన వ్యక్తం చేశారు. స్థానిక మండల విద్యాశాఖ కార్యాలయం ఎదురుగా ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఎస్జీటీలకు మాన్యువల్ కౌన్సెలింగ్ విధానంలో బదిలీలు నిర్వహిస్తామని చెప్పిన అధికారులు ఇప్పుడు వెబ్ ఆప్షన్ ఇవ్వడం సరికాదన్నారు. గతంలో ఇచ్చిన హామీకి అనుగుణంగా ఎస్జీటీలకు మాన్యువల్ విధానంలో కౌన్సెలింగ్ నిర్వహించాలని డిమాండ్ చేశారు. అనంతరం వినతిపత్రాన్ని మండల విద్యాశాఖ కార్యాలయ సిబ్బందికి అందజేశారు. నిరసనలో ఉపాధ్యాయ సంఘాల నేతలు గొడితి మురళీకృష్ణ, కలిది శ్రీనివాసరావు, ఆర్.భాస్కరరావు, ఎ.గాయత్రిదేవి, ఎం.సుబ్బలక్ష్మి, విల్లూరి వీరభద్రరావు మల్లేశ్వరపు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ బెటర్మెంట్ ఫలితాల్లో మోడరన్ విజయభేరి



అత్యధిక మార్కులు పొందిన విద్యార్థులతో మోడరన్ అధినేత జీవీ రావు తదితరులు

రామచంద్రపురం: ఇంటర్మీడియట్ బెటర్మెంట్ ఫలితాల్లో రామచంద్రపురం మోడరన్ జూనియర్ కళాశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి అత్యుత్తమ ఫలితాలతో రికార్డు స్థాయి ఫలితాలు సాధించినట్లు మోడరన్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ జీవీ రావు శనివారం విలేకరులకు తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఎంపీసీ గ్రూపులో 470 మార్కులకు పీవీవీఎస్ఎస్ఎస్ సంజన 466, జి.పూజిత 465, సీహెచ్ భవ్యశ్రీ 465, ఎ.మనోజ్ 465, ఎం.వరిణిక 465, ఎ.శరత్ 465, కె.జిష్ణు 464,బి.కావ్య 464, టి.రమ్యశ్రీ 464, ఎస్.తనూజ 464, బి.సాయి శ్రీకర్ 464, శశాంక్ సాయి సుజ 463, కె.హారిక 463, డి.జయచంద్రిక 463, జి.పవిత్ర 463, బి.శిరీష 463, డి.ఖాదన్ 463, ఎన్.కౌశిక్ 462, పి.రూప్సి 461, జె.ముకుందప్రియ 461, ఆర్.సత్యశ్రీ 461, వి.నిహల్ 461, జి.గౌతమి 461, సీహెచ్ శ్రీరామ్ 460, ఎం.శ్రీవైష్ణవి 460 మార్కులతో 25 మంది 460 పైబడి మార్కులు సాధించినట్లు తెలిపారు. బైపీసీలో 440 మార్కులకు కె.గాయత్రి 434, ఎ.ప్రసన్న 433, ఆశిరారావు 432, పి.వైష్ణవి 430 మార్కులు సాధించారని జీవీ రావు తెలిపారు. సీఈసీ గ్రూపులో 500 మార్కులకు ఎం.రాజేశ్వరి 488, టి.భువనేశ్వరి 485 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చాటారని పేర్కొన్నారు. విద్యార్థులను మోడరన్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ లయన్ జీవీ రావు, ప్రిన్సిపాల్ సీహెచ్ రాజేష్, వైస్ ప్రిన్సిపాల్ పీఎస్ ప్రకాష్, అకడమిక్ అడ్వైజర్ సీహెచ్ శ్రీనివాస్, మోడరన్ జూనియర్ కళాశాల స్టాఫ్ అభినందించారు.

భక్తిశ్రద్ధలతో బక్రీద్ వేడుకలు

- విలువలు, త్యాగానికి ప్రతీక
- పేదలకు దానధర్మాలు

రాయవరం: పవిత్ర బక్రీద్ పర్వదినం సందర్భంగా మండలంలో ముస్లింలు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలిపారు. దీంతో మసీదులు కళకళలాడాయి. ఆధ్యాత్మికోత్సాహంతో తకుబీరాలు. బక్రీద్ పర్వదినం సందర్భంగా శనివారం మండలంలోని పలు మసీదుల్లో ఇమామ్‌లు ఆధ్యాత్మిక ప్రసంగాలు చేశారు. సర్వమానవాళికి అల్లా బోధనలు అనుసరణీయమని మస్జిద్-ఎ-ఖ్యత్ ఇమామ్ హాఫిజ్ అహ్మద్ అబుబకర్ అన్నారు. మస్జిద్-ఎ-ఖ్యత్ నిర్వాహకుడు అహ్మద్ బాషా ఆధ్వర్యంలో బక్రీద్ వర్వదినాన్ని పురస్కరించుకుని ఆయన ముస్లిం సోదరులకు దైవసందేశాన్ని ఇచ్చారు. దైవారాధనా విశిష్టతను ప్రచారం చేసేందుకు మహా ప్రవక్త 'హజ్రత్ ఇబ్రహీం' చేసిన నిరుపమాన త్యాగాలతకు ప్రతీకే బక్రీద్ పర్వదినంగా ఆయన పేర్కొన్నారు. అల్లా సూచించిన విధంగా ప్రతి ఒక్కరూ తమకు కలిగిన సంపదలో కొంత పేదవారికి ఇవ్వాలన్నారు. ఎవరూ ఆకలితో ఆలమటించకూడదనే సదుద్దేశంతో అల్లా సమాజానికి సందేశాన్నిచ్చారన్నారు. ప్రతీ ముస్లిం ఇస్లాం పంచసూత్రాలైన అల్లాపై విశ్వాసం (ఇమాన్), ప్రార్థన (నమాజ్), ఉపవాసం(రోజా), దానం(జకాత్), మక్కాయాత్ర(హజ్)లను పాటించాలన్నారు. బక్రీద్‌ను పురస్కరించుకుని వెదురుపాకలోని మస్జిద్-ఇ-ఖయ్యత్‌లో ప్రత్యేక నమాజ్‌లు నిర్వహించారు. అనంతరం ఒకరికొకరు ఆలింగనం చేసుకుని తమ సంతోషాన్ని పంచుకున్నారు. కార్యక్రమంలో షేక్ ఖాజాబాబు, షేక్ వలీ, షేక్ మహబూబ్ బాషా, సలీం, సయ్యద్ బాషా తదితరులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని లొల్ల, రాయవరం, చెల్లూరు, వెల్లూరు గ్రామాల్లో కూడా బక్రీద్ వేడుకలను ముస్లింలు ఘనంగా జరుపుకొన్నారు.

కపిలేశ్వరపురంలో...

కపిలేశ్వరపురం: పవిత్ర మానవ సంబంధాలకు ప్రతీకగా బక్రీద్ పండుగ నిలుస్తుందని శనివారం బక్రీద్ కార్యక్రమాల్లో పాల్గొన్నవారన్నారు. అంగరలోని మస్ జిద్ ఎ ఇబ్రహీంలో ముతవల్లి అబ్బాస్ హుస్సేన్ ఆధ్వర్యంలో బక్రీద్ ప్రార్థనలు నిర్వహించారు. ఇమామ్ మౌలానా మహ్మద్ నాజీం అక్బర్ మాట్లాడుతూ బక్రీద్ ప్రాముఖ్యాన్ని వివరించారు. ప్రపంచ శాంతి కోరుతూ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సొంత కుటుంబం, బంధువులు, ప్రజలకు బక్రీద్ పండుగ రోజున మాంసాన్ని పంచడమనేది మానవ సమాజ ఐక్యతను తెలియజేస్తుందన్నారు. కార్యక్రమంలో అంగర, పడమర ఖండ్రిక, టేకి, వల్లూరు, వెదురుమూడి తదితర ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

మండపేటలో...

పట్టణంలోని మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ముస్లిం షాదీఖానాలో నిర్వహించిన ప్రార్థనా కార్యక్రమంలో ఇమామ్ షాహనవాజ్, మసీదు నిర్వహణ కమిటీ సభ్యులు సయ్యద్ ఇబ్రహీం షరీఫ్ మాట్లాడారు. ప్రవక్త ఇబ్రహీం అల్లే త్యాగం సకల జీవులకు ఆదర్శమయమన్నారు. కార్యక్రమంలో మసీదు కమిటీ అధ్యక్షుడు రహీం, అర్బ, మౌలాలీ, ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

ద్రాక్షారామలో...

రామచంద్రపురం రూరల్: మండలంలోని ద్రాక్షారామలో బక్రీద్ ప్రార్థనలతో మూడు మసీదుల్లో భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. ముస్లిం పెద్దలు, చిన్నలు స్నానాలు ఆచరించి మసీదులకు అల్లాహో అక్బర్ అంటూ ఊరేగింపుగా మసీదులకు చేరుకుని మత గురువులను అనుసరించి ఈద్ నమాజ్‌ను చేశారు. హజ్ యాత్రకు వెళ్లిన వారి గురించి దువా (వేడుకోలు) చేశారు. ద్రాక్షారామ షియా జామియా జాఫ్రి మసీదులో మత గురువు మీర్జా అస్మత్ హుస్సేన్, మార్కెట్‌లోని జామియా మసీదులో మత గురువు ముఫ్తీ తనుకమ్ హుస్సేన్, వెలంపాలెంలోని షాజాయా మసీదులో మత గురువు ఎండీ రిల్ నవాజ్ లు ఆయా మసీదుల్లో భక్తులకు తండ్రి, కొడుకుల కథనం ఇబ్రహీం, హజరత్ ఇస్మాయిల్ చేసిన త్యాగాన్ని సవివరంగా తెలిపారు. ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్న అనంతరం పూర్వీకుల సమాధుల వద్దకు ఊరేగింపుగా వెళ్లి సమాధుల వద్ద ఫాతిహా ఇచ్చారు. ఉదయం నుంచే తమ ఇళ్ల వద్ద ఖుర్బానీ ఇచ్చి చుట్టుపక్కల వారికి పంచుకున్నారు. మసీదులలో ఈద్ నమాజ్‌ను చదివించారు. మండలంలో వెలంపాలెం షాజాయా జామియా మసీదు మరమ్మత్తుల నిమిత్తం రూ.లక్ష సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ నుంచి అందజేసిన రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తండ్రి వాసంశెట్టి సత్యంను బక్రీద్ సందర్భంగా మసీదు కమిటీ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మసీదు కమిటీ అధ్యక్షుడు సయ్యద్ పాజిల్, మత గురువు ఎండీ దిల్ నవాజ్, మసీదు కమిటీ కార్యదర్శి షేక్ బాబులాల్, సభ్యులు షేక్ జమాల్ హుస్సేన్, షేక్ హుస్సేన్, షేక్ ఖాదర్, షేక్ గౌస్ తదితరులు పాల్గొన్నారు.



వెదురుపాక మసీదులో బక్రీద్ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



అంగరలో బక్రీద్ ప్రాశస్త్యాన్ని వివరిస్తున్న అక్బర్